క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

తాడూరు: మండల పరిధిలోని ఐతోల్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం ఏఓ సందీప్ కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా గ్రామంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో వరి పంటకు సంబంధించిన వరి విత్తన నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. విత్తన డీలర్లు నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని, రికార్డులు నిర్వహించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 66 మోసాలను ఎండ గట్టేందుకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ హైదరాబాద్ చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఆదివారం నిర్వహించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీల గారడి, అబద్ధాలు, మోసాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ నాయకులు దుర్గాప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బైక్ ర్యాలీని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి



తిమ్మాజీపేట : పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచేలా చూడాలని, ప్రభుత్వాసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డా. స్వరాజ్యలక్ష్మి సూచించారు. శనివారం తిమ్మాజీపేట పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ రికార్డులు తనిఖీ చేశారు. ఓపీ సేవలు , పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డా.ఇస్మాయిల్, సిబ్బంది బాలరాజు, రోజ, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు నమ్మొద్దు

వెల్దండ: మూఢ నమ్మకాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అపోహలు నమ్మవద్దని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లోనిపల్లి పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారని విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి నిరాకరించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లలను పాఠశాలకు పంపించడం లేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో గుమ్మడికాయ, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వివిధ రకాల వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు పడేశారు. వాటిని దగ్గరుండి శుభ్రం చేయించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ చూడాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ రూపకల్పనపై దీర్ఘకాలిక కుట్ర

పెంట్లవెల్లి: రాష్ట్ర సచివాలయంలో ప్రతిష్ఠించనున్న తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై దీర్ఘకాలిక కుట్ర దాగుందని మాజీ జెడ్పీటీసీ చిట్టెమ్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 18 సం.లుగా తెలంగాణ ప్రజల మనస్సులో ముద్రించబడిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేసి ఇష్టారీతిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించడమే కాకుండా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో ప్రతిష్ఠించాలనుకోవడం మూర్ఖపు చర్య అని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం కడు పేదరాలిగా, వ్యవసాయ కూలీగా, ముతక చీరలో ఉండాలనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, నర్సింహ, అబ్దుల్‌హుస్సేన్, బాలస్వామి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని 12, 13 వార్డులకు చెందిన ప్రజలు తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారంలో 3 నుంచి 4 రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరసనకు బీఆర్ ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. సంఘటనా చేరుకున్న పోలీసులు నిరసన విరమింపజేశారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



కలెక్టర్ బదావత్ సంతోష్‌కు బొకే అందజేస్తున్న అధికారులు

కల్వకుర్తి: జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని, పశుసంపద అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున కళాశాలలో ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం, పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ ఆఖరి సంవత్సరం విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ ముగింపు సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పశు సంపదకు పుట్టినిల్లైన జిల్లాలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు పశుసంపద పరిరక్షణకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ ఉదయ్ కుమార్, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి డాక్టర్ రమేష్, విజయ డైరీ డీడీ ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి..

విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని స్టోర్ రూంలో కూరగాయలు, వంట సరుకులు, బియ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, వైస్ ప్రిన్సిపాల్ పార్వతమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



వాటర్ ట్యాంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి : మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాలు పరిపాలన చేసిన కూడా నేటికి వాటి ఫలాలు లబ్ధిదారులకు అందలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని త్వరితగతిన పూర్తి చేసి సంవత్సరంలోపే అందిస్తుందన్నారు. శనివారం మండలంలో బిజినేపల్లి తండాలో మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఆహ్వానం మేరకు 20 కేఎల్ జీఎల్‌ఎస్‌ఆర్ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తండాలో పార్టీ జెండాను ఆవిష్కరించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిద్దె రాములు, తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, నసీర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం



విరాళం అందజేస్తున్న సంజీవ్‌కుమార్

వెల్దండ: మండల కేంద్రంలోని శివునిగుట్టపై ఉన్న ఆలయాల అభివృద్ధికి శనివారం కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ వావిళ్ల మనీలా సంజీవ్‌కుమార్ రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు దైవభక్తితో మెలగాలన్నారు. వ్యక్తిగతంగా ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, వెంకటేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతోనే ఏడాది పూర్తి



లింగాలలో ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

లింగాల: అబద్ధాల హామీలతో రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాలను జరుపుకోవడం సిగ్గు చేటని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిసెట్టి నాగరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై శనివారం మండల కేంద్రంలో చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు అబద్ధాలు, 66 మోసాలతో కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలం పాలన గడిపిందని ఎద్దేవ చేశారు. 6 గ్యారంటీలను గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసినట్లు చెప్పుకోవడం దారుణమన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ లింగాల, పదర మండలాల అధ్యక్షులు సలేశ్వరం, గోలిరాజు, నాయకులు శంకర్‌గౌడు, శ్రీనివాసులు, నవీన్, సాగర్‌రావు, ప్రసాద్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కొల్లాపూర్‌లో ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

కోడేరు: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎంఈఓ భాస్కర్‌శర్మకు శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, సీఆర్‌పీలు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులుగా విద్యాశాఖలో పని చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 10లక్షల ఆరోగ్య బీమా చెల్లించి పదవీ విరమణ తర్వాత 25లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు సాయికుమార్, నాగ్యానాయక్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ: విద్యాశాఖ– సమగ్ర శిక్షలో కాంట్రాక్టర్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10వ తేదిన నిరవధిక సమ్మె చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలయ్య, చంద్రశేఖర్, పెంటయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె నోటీసు

కొల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు ఎంఈఓ ఇమ్మానుయేల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో విష్ణుయాదవ్, సుధాకర్‌సింగ్, మహ్మద్ అలీ,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అచ్చంపేటలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ఇంటింటికి తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమంతు, ఆదిలక్ష్మి, చిట్టెమ్మ, చిన్నమ్మ, కేశమ్మ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల..

తాడూరు: మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా మహా సభల వాల్‌పోస్టర్‌ను మండల కార్యదర్శి కాశన్న విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకుల శ్యాంసుందర్, వెంకటస్వా మి, మహేష్, శివకృష్ణ, పాల్గొన్నారు.

మండల కమిటీ సమావేశం..

తెలకపల్లి: సీపీఎం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపస్ లక్ష్మణ్, విజయ్ గౌడ్, జగదీష్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం : వస్త్ర దుకాణంలో నగదు చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన సమాచారం మేరకు.. జిల్లా కేంద్రంలోని ఓ షాపింగ్ మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న వరంగల్‌కు చెందిన సాయికృష్ణ ఈనెల 5న రూ. 6.90 లక్షల నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేయకుండా చోరీ చేసి వెళ్లిపోయాడు. యజమానులు శనివారం వస్త్ర దుకాణంలో లెక్కలు చూస్తుండగా నగదు తక్కువగా ఉండటంతో సాయికృష్ణ చోరీ చేసినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవితతో నాగర్‌కర్నూల్ భారత జాగృతి విభాగం నాయకులు

కల్వకుర్తిరూరల్: భారత జాగృతి జిల్లా స్థాయి సమావేశం హైదరాబాద్‌లోని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత స్వగృహంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రాబోయే రోజుల్లో జాగృతి తరుపున నిర్వహించే కార్యక్రమాలను, భవిష్యత్ ప్రణాళికను చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంజుల, సుశీల, అల్లుడు కృష్ణ, ప్రియాంక, పర్వతాలు గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి

చారకొండ: గ్రామీణ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని ఎంఈఓ ఝాన్సీరాణి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని జూపల్లిలో శనివారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సీఎం కప్ క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం, దృఢత్వం, స్నేహభావం పెంపొందుతాయన్నారు. గ్రామీణ స్థాయి విజేతలు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజయ్య, పీఈటీ వరలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అమ్రాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి బాలకిషన్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాణ్యమైన చదువులు అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్‌ఎం విజయ్ మోహన్, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కాళ్ల దూడ జననం

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ గ్రామంలో మార్క భద్రాచలానికి చెందిన గేదె శనివారం రెండు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. దూడకు ముందరి కాళ్లు లేవు. ప్రస్తుతం దూడ బతికే ఉంది.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

పెద్దకొత్తపల్లి: ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని గురుస్వామి తిరుపతయ్య అన్నారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ ఇంటి వద్ద శనివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. ఏ ప్రాంతంలో భక్తిభావం ఎక్కువగా ఉంటే ఆ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. పూజ అనంతరం స్వాములకు అన్నదానం నిర్వహించారు.

లైంగిక వేధింపులపై అవగాహన

తెలకపల్లి: బాలికలు లైంగిక వేధింపులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామ పంచాయితీ వద్ద లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు అనే అంశంపై కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బడిఈడు పిల్లలందరిని పాఠశాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఏఎన్‌ఎం రాధిక, ఆశా కార్యకర్తలు అలివేల, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైదులు

బల్మూర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ప్రిన్సిపాల్ డి.సైదులు అన్నారు. మండలంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యార్థి దశనే రేపటి భవిష్యత్తుకు నాంది అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. కళాశాలలో 90 రోజుల ప్రణాళికతో ప్రత్యేక స్టడీ అవర్స్‌తో బోధన చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శోభారాణి, అనిత, శైలజ, ఆంజనేయులు, సయ్యద్, మల్లేష్, సత్యం, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యూత్ నాయకులు

తాడూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తుందన్నారు. అవినీతి అక్రమాలపై గొంతుతెత్తున్న ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి అణిచివేసే కుట్ర చేస్తుందని విమర్శించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన నిర్బంధాలకు పాల్పడినా ప్రజా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జానకిరాం, నారాయణ, బాబుసాగర్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం



ఆలయంలో కల్యాణం జరుపుతున్న పూజారులు

కందనూలు : జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ వినోభా నగర్ కాలనీలో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. పల్లకి సేవను ఆలయం వరకు భక్తుల కోలాటాలతో ఊరేగింపు చేశారు. అనంతరం అభిజిత్ లగ్న సమయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, సామూహిక వడి బియ్యం కార్యక్రమం వేద పండితులు నర్వ శివరామశర్మ నిర్వహించారు. అనంతరం మహిళలకు తలంబ్రాల పంపిణీతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. పల్లకి సేవను చంద్రకల్ భజన బృందం ఆటపాటలతో, మహిళా కోలాటాలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకీం విశ్వ ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు వేణు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సుబ్రమణ్య షష్ఠి మహోత్సవం..

దోమలపెంట: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శనివారం దోమలపెంట శివాలయంలో వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, స్వామి వారికి పంచామృత అభిషేకాలు, హోమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అర్చకులు అందజేశారు.

యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

చారకొండ: అంబేడ్కర్ 68వ వర్ధంతి వేడుకల సందర్భంగా మండలంలోని జూపల్లిలో గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అర్కంటి నిరంజన్, ఉపాధ్యక్షుడిగా ఈరగల్ల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా అంకిల్ల ప్రశాంత్ కూమార్, కార్యదర్శిగా జంతుక అంజనేయులు, కోశాధికారిగా పరుశరాములు, ప్రధాన సలహాదారులుగా మధు, మహేష్, క్రీడా కార్యదర్శిగా బాలస్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా అంకిల్ల మల్లికార్జున్, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సన్మానించారు. అధ్యక్షుడు నిరంజన్ మట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పని చేస్తానని, సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య యాదవ్, బాలేమియా, రాములు యాదవ్, ముస్తాఫా , బాలరాజు, పెద్దయ్య యాదవ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకుడికి ఘన సన్మానం



శివకుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

బల్మూర్: నల్లమల ప్రాంతంలోని బల్మూర్ మండలం కొండనాగుల శ్రీ ఉమామహేశ్వరీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు శివకుమార్ డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ పరంగి రవి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. శివకుమార్ రాజస్థాన్‌లోని సన్‌రైస్ విశ్వ విద్యాలయంలో డాక్టర్ కృష్ణదూబే ఆధ్వర్యంలో 'ఏ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ ప్రైసింగ్ అండ్ గ్రేడింగ్ ఐఓపీఎస్ పర్ఫామెన్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై డాక్టరేట్ పట్టా పొందడం కళాశాలకే గర్వకారణమని కొనియాడారు. అధ్యాపకులు డాక్టర్ ధూప్‌సింగ్ లకావత్, డా.కే అశోక్ కుమార్, డా.జి లక్ష్మాగౌడ్, అధ్యాపకేతర సిబ్బంది వి. నర్సింహ్మారావు, నర్సింహులు, ఎం.శివమ్మ, ఫర్జానా బేగం, షాంద్‌బీ, రేణుక, ఆంజనేయులు, ప్రేమ్‌నాయక్, కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

సరోజ్‌కుమార్ మహాను సన్మానించిన నాయకులు



సరోజ్‌కుమార్ మహాతో రాములు యాదవ్

చారకొండ: ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సరోజ్‌కుమార్ మహాను చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన నకినమోని రాములు యాదవ్, పలువురు నాయకులు శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు శుభాకాంక్షలు

మన్ననూర్: జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన రమేష్ కుమార్‌ను ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులు హన్మంత్, లక్ష్మీనారాయణతో కలిసిన జిల్లాలోని నాలుగు డివిజన్లలోని విద్యా వ్యవస్థ గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.

దాడికి వ్యతిరేకంగా రాస్తారోకో



కొండనాగులలో రాస్తారోకో చేస్తున్న భక్తులు, గ్రామస్తులు

బల్మూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిస్తూ శనివారం మండలంలోని కొండనాగులలో అచ్చంపేట ప్రధాన రహదారిపై ఆంజనేయస్వామి భక్తులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వనవాసి కళ్యాణ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అధికమయ్యాయన్నారు. ఇస్కాన్ నిర్వాహకులు కృష్ణదాసును అరెస్ట్ చేయడం దారుణమైన చర్య అన్నారు. భారత ప్రభుత్వం ఆదేశంపై కఠిన చర్యలు తీసుకొని హిందువులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వామి కొండల్, సైదులు, కిరణ్‌కుమార్, సుధాకర్ గౌడ్, శంకర్ గౌడ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి ప్రభుత్వం కృషి



108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం మంజూరు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని శనివారం నాయకులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడ్, కాసారపు వెంకటయ్య ముదిరాజ్, మల్లయ్య ముదిరాజ్, తిరుపతి రెడ్డి, పురుషోత్తంచారి తదితరులు పాల్గొన్నారు.